క్లుప్తంగా

యూనిఫాంల పంపిణీ



చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: కామునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య మాట్లాడుతూ..అంగన్‌వాడీ చిన్నారులకు సైతం ఏకరూప దుస్తులను అందజేయడం అభినందనీయమన్నారు. వారికి కూడా విద్యార్థుల వలే సౌకర్యాలు కల్పించడం మంచి సంప్రదాయమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పించేందుకు సిబ్బంది కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పండరీ బాయి, ఉపాధ్యాయులు రజిత, లలిత, కవిత, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్ సంతోషికి సన్మానం



సంతోషిని సన్మానిస్తున్న జైశ్రీరాం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణానికి చెందిన మాస్టర్ అథ్లెట్ సంతోషికి బుధవారం పలువురు ఘనంగా సన్మానించారు. మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన విషయం విధితమే. ఈ సందర్భంగా పట్టణంలోని జైశ్రీరామ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సెయింట్ మార్క్స్ స్కూల్లో సహచర విద్యార్థులు సైతం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 48 ఏళ్ల వయస్సులో కూడా క్రీడలు, ఫిట్‌నెస్‌పై మక్కువతో రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్స్ సాధించి, జాతీయ పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయం

పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి



మాట్లాడుతున్న యాదవరెడ్డి

దోమ: రైతుల అభ్యున్నతే ధ్యేయమని పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం రైతుల వివరాలు, ఎల్టీ రుణాలపై ఆరా తీశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతులకు అవసరమైన సహకార రుణాలతో పాటు ఎల్టీ రుణాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సహకార సంఘంలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ యాదగిరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు యాదయ్యసాగర్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను సక్రమంగా నిర్వహించాలి

ఏపీవో రాములు



ఆలేడ్‌లో నర్సరీని పరిశీలిస్తున్న రాములు

దుద్యాల్: నర్సరీలను సక్రమంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కొడంగల్ ఏపీవో రాములు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హస్నాబాద్, ఆలేడ్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని నర్సరీలను, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన నర్సరీల్లో మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచిగా వండి పెట్టాలని వంట సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రమేశ్, కృష్ణవేణి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సప్తవర్ణ శోభితం

- 'సాక్షి', గంగోత్రి విద్యాలయం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు
- రంగవల్లులతో శోభాయమానంగా పాఠశాల ప్రాంగణం
- హాజరైన ఎమ్మెల్యే బీఎంఆర్



ముగ్గులు వేస్తున్న మహిళలు

తాండూరు: పుడమితల్లి రంగులతో సప్తవర్ణ శోభను సంతరించుకుంది. మగువల చేతిలో నుంచి జాలువారిన ముత్యాల ముగ్గులు ఆకట్టుకున్నాయి. సాక్షి దినపత్రిక గంగోత్రి విద్యాలయం సంయుక్తంగా బుధవారం తాండూరు పట్టణంలోని గంగోత్రి విద్యాలయంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముత్యాల్లాంటి ముగ్గులు వేసి వాటిలో ఇమిడి పోయే రంగులను అద్ది చక్కగా తీర్చి దిద్దారు. భోగి మంట సంక్రాంతి విశిష్టతను తెలిపేలా ముగ్గులు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు పోటీలు నిర్వహించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, గంగోత్రి విద్యాలయ చైర్మన్ ఇందూర్ రాములు, పలువురు ప్రముఖులు రంగవల్లులను తిలకించారు. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సాక్షి పత్రిక చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని వారు కొనియాడారు.

సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే కార్యక్రమం

సంక్రాంతి ముగ్గుల పోటీలు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే కార్యక్రమమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సాక్షి దిన పత్రిక రంగవల్లుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సంక్రాంతి పండుగ అంటేనే ఇంటి ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టడమే కాకుండా చేతికొచ్చిన పంట ఉత్పత్తులను ఉంచి పూజ చేయడం అనవాయితీగా వస్తోందన్నారు.

విజేతలకు నగదు బహుమతుల ప్రదానం

ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, మున్సిపల్ కౌన్సిలర్ నీరజా బాల్‌రెడ్డి, విద్యావేత్త కీర్తిశర్మ, కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, మహిళా నాయకులు గాజుల మాధవి ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి ఇంద్రజకు రూ.10,000లు, ద్వితీయ బహుమతి మంజుల రూ.5,000లు, తృతీయ బహుమతి సుజాత రూ.2000లు, ప్రోత్సాహక బహుమతిని కావ్యశ్రీకి రూ.1,000 అందజేశారు. అనంతరం గంగోత్రి విద్యాలయ చైర్మన్ ఇందూర్ రాములు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నీరజా బాల్‌రెడ్డి, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల నర్సింహులు, జుబేర్‌లాల, పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శోభారాణి, మాజీ సర్పంచ్ హన్మంతు, ఏఎంసీ డైరెక్టర్ రాజు, గంగోత్రి విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు భానుచందర్, తాండూరు సాక్షి దిన పత్రిక ప్రతినిధులు కరణం భీంసేన్‌రావు, సంగమేశ్వర్, జావీద్‌హుస్సేన్, ముకుంద్‌రెడ్డి, సాక్షి టీవి ప్రతినిధి రామకృష్ణ, సామాజిక కార్యకర్త వెంకటయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్, నాయకులు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు స్వప్నపరిమళ్, కీర్తిశర్మ

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు తదితరులు

జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య

దోమ: క్రీడలతో శారీరక, మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో రంగారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థులతో క్యాంపు నిర్వహించి ఐదు రోజులుగా ఖోఖో శిబిరాలు నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరాల్లో పాఠశాల విద్యార్థులతో పాటు ఆయా పాఠశాల విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఈ మేరకు పలువురు విద్యార్థులను ఎంపిక చేసి వరంగల్‌లోని జిల్లా పరిషత్ గీసుకొండా పాఠశాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణను అలవర్చుకుంటే ఏదైన సాధించొచ్చన్నారు. ప్రతీవిద్యార్థి క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ శకుంతల, నిర్వాహకులు వెంకట్‌రాములు, చెన్నారెడ్డి, బందయ్య, పాఠశాల ఉపాధ్యాయులు రూప్‌సింగ్, శివకుమార్, రాజు, రాము, ఇంచార్జి పీఈటీ గోపాల్, గ్రామస్తులు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



మాట్లాడుతున్న ఆంజనేయులు

కుల్కచర్ల: కుల్కచర్ల మార్కెట్ అభివృద్ధికి కృషిచేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో మొదటి సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో మార్కెట్‌ను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కులకచర్లలో ఎడ్లసంత నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తున్నామని, రైతులకు ఉపయోగకరంగా ఉండే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రైతుల నుంచి వివిధ ధాన్యాలను సేకరించేందుకు 20దుకాణ సముదాయాలను ఏర్పాటుచేసేందుకు, మార్కెట్లో మరుగుదొడ్లు, మంచినీటి ఫిల్టర్ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి ఆధ్వర్యంలో దుకాణసముదాయాల నిర్మాణానికి రూ. 50లక్షలు, మార్కెట్ కమిటీ కార్యాలయంలో 10లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం, 3లక్షలతో తాగునీరు సౌకర్యం వంటి వాటికి ప్రతిపాదనలను సిద్ధం చేసి ఏకగ్రీవంగా తీర్మానించారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయ్‌కిశోర్, డైరెక్టర్లు తమ్మలి రాంచంద్రయ్య, భరత్‌కుమార్ రెడ్డి, రాజమణి, నీల్యానాయక్, హాజీ, చిన్నయ్య, రాంచందర్, రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

మోమిన్‌పేట: టీయూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలండర్‌ను ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైందన్నారు. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆమె సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి దేవ్యానాయక్, మండల గౌరవ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నిలాంభిక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో టీయూపీఎస్ ఉపాధ్యాయ సంఘం క్యాలండర్‌ను ఎంఈఓ వెంకట్‌స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూపీఎస్ మండల అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు తమ సంఘం ముందుంటుందన్నారు. ప్రధానకార్యదర్శి నరేశ్‌గౌడ్, మహిళా ఉపాధ్యక్షులు బసవలింగమ్మ, ఆశప్ప, మల్లమ్మ, నవీన్‌కుమార్, బసప్ప పాల్గొన్నారు.



మోమిన్‌పేట: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు

గణిత భయం తొలగించేందుకే మేళా



రామానుజన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మండల విద్యాధికారి విజయరామారావు

దుద్యాల్: విద్యార్థుల్లో భయం తొలగించేందుకు గణిత మేళా ఉపయోగపడుతాయని మండల విద్యాధికారి విజయరామారావు పేర్కొన్నారు. బుధవారం దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గణిత మేళాకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల గణిత నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గణితం అంటేనే విద్యార్థులకు భయం ఉంటుందన్నారు. కానీ నేర్చుకుంటే చాలా తేలికన్నారు. కాబట్టి విద్యార్థుల్లో ఈ భయం తొలగించాలంటే ఇలాంటి మేళా, గణిత క్విజ్ వంటివి నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గణితంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నేర్పించాలన్నారు. ఈ మేళాలో హకీంపేట్, కుదురుమల్ల, గౌరారం, సాగారం తండా, లగచర్ల, పోలెపల్లి తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గణిత మేళా ప్రారంభానికి ముందు గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఎస్‌ఐలు బాలక్రిష్ణ, రాహుల్, ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, వేణుగోపాల్, వెంకటయ్య, తేజస్విని, రాములు, సుధాకర్ రావు, శ్రీనివాస్, రవి నాయక్, రమేశ్, ముకుంద రెడ్డి, మాధవి, తిరుపతయ్య, చందర్ నాయక్, వెంకటేశ్, ఉమా మహేశ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మర్పల్లి: అండర్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సురేశ్ యాదవ్

ధారూరు: ధారూరు మండల పరిధిలోని పీసీఎం తండాలో బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ. 14 లక్షలతో తండాలో అవసరమైన చోట సీసీ రోడ్లు వేయిస్తున్నట్లు మాన్‌సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు అనంతయ్య, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ పుల్యానాయక్, అనిల్, రాజు, సాయన్న, సిద్ధప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తాం

మర్పల్లి: ప్రతిగ్రామంలో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం గుండ్ల మర్పల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులను గూడెం రాములు యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం తుమ్మలపల్లిలో కొనసాగుతున్న అండర్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పులుమద్ది సాయన్న, పంచలింగాల సురేశ్, మాజీ ఎంపీటీసీలు సంజీవరెడ్డి, మహేశ్, సాయిబాబా, సిద్ధన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువైంది

అనంతగిరి: ప్రజాస్వామ్యంలో ఓటు విలువైందని మదన్‌పల్లి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ యాదయ్య అన్నారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ ఎన్నికలు నిర్వహించారు. రిటర్నింగ్ అధికారిగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు. విద్యార్థులు ఓటుహక్కును వినియోగించుకొని సర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా తొమ్మిదోతరగతి విద్యార్థిని జోయ, ఉప సర్పంచ్‌గా సమీర్, వార్డు సభ్యులుగా అఖిలాల్, అక్షర, అనితా ఎన్నికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలతా, పాండు, తాజోద్దీన్, లక్ష్మయ్య, స్వరూప, అరవింద్, అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ అలివేలమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాక్‌పోలింగ్‌లో విద్యార్థులు, తదితరులు

సంత్రకుంటలో ప్రారంభమైన పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: సంత్రకుంట తండాలో పారిశుద్ధ్యం లోపించడంతో తండా వాసులు అవస్థలు పడుతున్నారనే విషయాన్ని 'సాక్షి'లో మురుగు పరుగు.. అనే కథనాన్ని బుధవారం ప్రచురించాం. దీనికి అధికారులు స్పందించి తండాలో పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించారు. తండాలో ప్రధాన వీధులు, రోడ్డుపై పారుతున్న మురుగును తొలగింపజేశారు.



రోడ్లను శుభ్రపరుస్తున్న కార్మికులు

బస్సు సమయానికి నడపాలని ధర్నా

ఎమ్మెల్యే చొరవతో విరమణ



మంబాపూర్‌గేటు వద్ద ధర్నా చేస్తున్న జనగాం విద్యార్థులు

తాండూరు రూరల్: జనగాం గ్రామానికి చెందిన విద్యార్థులు బుధవారం బస్సు సమయానుకూలంగా రావాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. వారం రోజులుగా గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదని తాండూరు-హైదరాబాద్ ప్రధానరోడ్డు మంబాపూర్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన సమయానికి బస్సు రాకపోవడంతో కళాశాల, పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంలో ఆర్టీసీ డీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఫోన్‌లో విద్యార్థులతో మాట్లాడారు. ఎమ్మెల్యే బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు, గ్రామస్తులు ధర్నా విరమించారు.

దళిత మహిళలకు పాదపూజ

బషీరాబాద్: మహారాష్ట్రలోని ముంబాయి నగరంలో రాష్ట్ర సాదూపరిషత్ అధ్యక్షుడు, దామర్‌చెడ్ భవానీమాత పీఠాధిపతి శంకర్ స్వామిజీ 108 మంది దళిత మహిళలకు పాదపూజ చేశారు. ముంబాయిలోని ములాన్డ్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆయన స్వయంగా మహిళల పాదాలు కడిగి ఆశీస్సులు తీసుకున్నారు. సమాజంలో మనుషులంతా ఒక్కటేనని సనాతన ధర్మం చెబుతుందన్నారు. సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీహెచ్‌పీ నాయకులు నరేశ్ పాటిల్, కొంకణ్ ప్రాంత సామాజిక సేవాప్రముఖులు మారుతి, భారతానంద స్వామీజీ, నీలేష్ స్వామిజీ, మునిజ, అంజనీ సారఫ్, కౌస్తుభ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

పరిగి: పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని నంబర్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆపార్ ఐడి జనరేట్ చేయాలని సూచించారు. ఏమైన సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. పదోతరగతి ఫలితాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లాలోనే మండలాన్ని ఉన్నత స్థానంలో నిలిచేల కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన, చైల్డ్‌సేఫ్టీ కమిటీలు కచ్చితంగా పాఠశాలలో తనిఖీ చేయాలని సూచించారు. ఆయా పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజన నిర్వహణను తప్పకుండా పరిశీలించాలని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పరామర్శ

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు బిల్లకంటి సాయిరెడ్డి భార్య పదిరోజుల క్రితం ఆకస్మికంగా మృతిచెందారు. కాగా బుధవారం పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి బాధిత కుటుంబీకుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇబ్బందికర సమయాల్లోనే దృఢంగా ఉండాలని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

కొడంగల్ రూరల్: ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో మద్దతుగా స్థానిక కాంగ్రెస్ నాయకులు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏఐసీసీ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ రాజేష్ లిలోథియా ఢిల్లీలోని సింహపురి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తుండగా స్థానిక యువజన కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్ కృష్ణంరాజు బుధవారం ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ముమ్మర ప్రచారం నిర్వహించారు.

◆ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

యాలాల: అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని యాలాల ఎస్‌ఐ గిరి హెచ్చరించారు. బుధవారం మండలంలోని సంగెంకుర్దు కాగ్నా నది నుంచి అనుమతులు తీసుకుని ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేశారు. యాలాల రెవెన్యూ అధికారులు జారీ చేసిన అనుమతి పత్రాలు, ఎన్ని ట్రిప్పులు, డ్రైవర్ల లైసెన్సులు తదితర పత్రాలను తనిఖీ చేశారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ట్రాక్టరును సీజ్‌చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

◆ శబరి యాత్రకు అయ్యప్ప స్వాములు

దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామంలో అయ్యప్ప స్వాములు బుధవారం శబరి యాత్రకు బయలుదేరారు. 41 రోజుల దీక్ష ముగించుకుని స్వామి వారిని దర్శించుకునేందుకు శబరి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలోని శివాలయంలో ఇరుముడి కట్టుకుని అయ్యప్ప స్వామి నామస్మరణతో నెత్తిన ఇరుముడి పెట్టుకుని ఊరేగింపుగా బయలుదేరారు.

◆ గ్లాసుల పంపిణీ

పరిగి: మండల పరిధిలోని రంగంపల్లి యూపీఎస్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచితంగా స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతీ రోజు ఉదయం రాగిజావ అందిస్తుండంతో విద్యార్థులకు గ్లాసులు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన ఉపాధ్యాయురాలు ప్రతిభ స్టీల్ గ్లాసులను ఉచితంగా అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థుల సమస్యలను గుర్తించి ఉపాధ్యాయురాలు సాయం చేయడం అభినందనీయమన్నారు.

◆ హాస్టల్ తనిఖీ

బషీరాబాద్: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహంలో తహసీల్దార్ వెంకటేశం మంగళవారం తనిఖీ చేశారు. కిచెన్‌లో వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు.

మర్పల్లిలో..

మర్పల్లి: పదోతరగతి పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలని ఎంపీడీఓ రాజమల్లయ్య పేర్కొన్నారు. పట్లూర్ బాలుర వసతి గృహం, మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. ఇటీవల వసతి గృహాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలో ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

దోమలో..

దోమ: విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ మహేశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీతో పాటు ఎస్సీ హాస్టల్‌ను ఎంఈఓ వెంకట్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ఏమైన ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం హాస్టళ్ల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

◆ సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

నవాబుపేట: సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని నవాబుపేట ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. సెల్‌ఫోన్ల వాడకం అధికమవ్వడంతో యువత ఈజీగా డబ్బు సంపాదించాలనే ఆశతో సైబర్‌నేరగాళ్ల వలలో పడి మోసపోతున్నారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మహమ్మద్ రెహమాన్, శ్వేత పాల్గొన్నారు.